# మానసిక ప్రశాంతతోనే ఆరోగ్యం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, అక్టోబర్ 10 : ప్రస్తుత సమాజంలో మానసిక ప్రశాంతతోనే మనిషి ఆరోగ్యంగా ఉంటారని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ అన్నారు. మంగళవారం అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యవిద్యార్థులు, డాక్టర్ల అందరూ అవగాహన ర్యాలీని బైపాస్ రోడ్డు నుంచి జనరల్ దవాఖాన వరకు వాక్‌తన్ నిర్వహించారు. ఈ సందర్భంగా దవఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ మాట్లాడుతూ మానసిక రోగుల హక్కుల గురించి మానసిక రోగుల నివారణ చర్యల గురించి వీరికి పట్టణ, గ్రామస్థాయిలో ప్రభుత్వ




జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

కల్పిస్తున్న సదుపాయాల గురించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి మనిషి సమస్యలను ఎదుర్కోవాలని, కృంగిపోవడంతో రోగాల భారిన పడతామని ఆరోగ్యంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్థోపేడిక్ విభాగాధిపతి డాక్టర్ రామ్‌కిషన్, మానసిక వైద్య హెచ్‌వోడీ డాక్టర్ రమాకాంత్, డాక్టర్ నజ్మా, ఆర్‌ఎంవో డాక్టర్ వక్కులా, డాక్టర్ సునీతా, డాక్టర్ అనిల్ రాజు, డాక్టర్ లక్ష్మీపద్మాప్రియ, ఎస్పీఎం డాక్టర్ కిరణ్‌ప్రకాశ్, డాక్టర్ ఋషికేష్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, డైటిషియన్ వరప్రసాద్, డాక్టర్ ఆది చైతన్య, సీహెచ్‌వో రాములునాయక్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌వి బూటకపు చేరికలు

- ముడా డైరెక్టర్ సాయిలు



విలేకరులతో మాట్లాడుతున్న ముడా డైరెక్టర్ సాయిలు

భూత్పూర్, అక్టోబర్ 10 : కాంగ్రెస్ పార్టీ చేరికలు బూటకమని ముడా డైరెక్టర్ సాయిలు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో సోమవారం రాత్రి డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి 300 మంది కాంగ్రెస్‌లో చేరినట్లు హల్‌చల్ చేయడం విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే కాకముందే పెద్ద కాంట్రాక్టర్ వ్యవహారాలు చేసేవారు. ఎమ్మెల్యే అయ్యాక పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. నీ సొంత మండలం(చిన్నచింతకుంట)లో కొన్ని కోట్లతో చెక్‌డ్యాంలను నిర్మించి మండలాన్ని సస్యశ్యామలంగా మారుస్తున్నారని అన్నారు. ఇంకోసారి ఎమ్మెల్యేపై చౌకబారు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామకృష్ణ, కోఆప్షన్లు అజీజ్, జాకీర్, పట్టణాధ్యక్షుడు బాలస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్, చంద్రశేఖర్, సురేశ్, సలీం, బాలరాజు, మస్తాన్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు పోల్కంపల్లి విద్యార్థులు

మూసాపేట, అక్టోబర్ 10 : మండలంలోని పోల్కంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగయ్య తెలిపారు. మంగళవారం విద్యార్థులను ఆ పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను ఆయనతోపాటు ఆ పాఠశాల వ్యాయామ అధ్యాపకుడు నిరంజన్‌రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ రాంచంద్రయ్య, అధ్యాపక బృందం సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ధర్మతేజ, శివయ్య రగ్బీ క్రీడలకు అండర్ – 17 విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న 67వ రగ్బీ పోటీల్లో అడనున్నట్లు తెలిపారు.

## వెంకన్నకు మొక్కులు

దేవరకద్రరూరల్(కౌకుంట్ల), అక్టోబర్ 10 : దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మూడోసారీ లక్ష మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలవాలని తిరుపతి వెంకన్న స్వామికి పలువురు సర్పంచులు ముడుపు కట్టారు. సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు శివరాజు, రేకులంపల్లి సర్పంచ్ స్వామి, దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ దశరథ్‌రెడ్డితో మంగళవారం తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆలన్న లక్షకు పైగా మెజార్టీతో గెలిచిన తర్వాత తిరిగి తిరుపతి స్వామి మొక్కులు చెల్లించనున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే సీఎం కేసీఆర్ సతీమణి శోభ తిరుపతికి వచ్చిన సందర్భంగా వారు మర్యాదపూర్వకంగా ఆమెను కలిసినట్లు వారు తెలిపారు.

## ఎన్నికల నియమావళిపై అవగాహన



మాట్లాడుతున్న తాసీల్దార్ శ్రీనివాసులు

మూసాపేట, అక్టోబర్ 10 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సోమవారం తాసీల్దార్ శ్రీనివాసులు అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటించాల్సిన నిబంధనలు, ఎన్నికల నిర్వాహణ, కార్యచరణపై పలు సూచనలు, సలహాలు చేశారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా వివరాలు ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులు, ఇబ్బందులపై ప్రత్యేకించి నివేధికలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, ఎంపీవో సరోజ, గిర్ధావర్ రవి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల తొలగింపు

దేవరకద్ర, అక్టోబర్ 12 : సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో పట్టణంలో వివిధ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను, జెండాలను తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు రావడంతో వారు మంగళవారం సిబ్బంది పట్టణంలో ఫ్లెక్సీలు, పోస్టర్లు జెండాలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ పార్టీలకు సంబంధించిన ఎలాంటి బ్యానర్లు ఉండరాదని గోడలపై ఏమైనా రాతలు ఉన్నట్లైతె వాటిని కూడా తూడిపించాలని తాసీల్దార్ బ్రహ్మం సూచించారు.

## దరఖాస్తులు స్వీకరించాలి

దేవరకద్ర, అక్టోబర్ 10 : మండలంలోని ఆయా గ్రామాల్లో 18 ఏండ్లు నిండిన వారి నుంచి ఓటర్ నమోదు కోసం దరఖాస్తు చేసుకుంటే వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని తాసీల్దార్ బ్రహ్మం సూచించారు. మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ అర్హత కల్గిన యువతి, యువకులు ఓటరు నమోదు చేసుకోకపోతే ఈనెల 30 వరకు ఓటు హక్కు నమోదు కోసం అవకాశం ఉందని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీలు శివరాజ్, అబ్దుల్ రహమన్, ఆర్‌ఐ సురేశ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## గీతా పారాయణం

భూత్పూర్, అక్టోబర్ 10 : మున్సిపాలిటీలో మాతృమండలి ఆధ్వర్యంలో మంగళవారం గీతా పారాయణం భక్తి శ్రద్ధలతో పటించారు. గీతా పారాయణం తో ప్రకృతిలో దైవత్వం ఆవరించి ఉంటుందని, ప్రతి ఇంటిలో గీతా పారాయణం చేయడంతో శుభ ఫలితాలు ఉంటాయని మాతృమండలి సభ్యులు అన్నారు. కార్యక్రమంలో మాతృమండలి సభ్యులు పుష్పమ్మ, రామేశ్వరమ్మ, హేమలత, శ్రీలత, శారద పాల్గొన్నారు.

## అపరిచితులకు సమాచారం ఇస్తే ఖాతా ఖాళీ

- ఎస్సై శ్రీనివాసులు




సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసులు

మూసాపేట, అక్టోబర్ 10 : ఫోన్‌లో అడిగిన వారికి మీ బ్యాంకుకు సంబంధించిన సమాచారం ఇస్తే ఖాతా ఖాళీ అవుతుందని ఎస్సై శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం మూసాపేట పోలీస్‌స్టేషన్ అవరణలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫోన్ చేసి ఖాతా నెంబర్, ఓటీపీ, లేదా ఆధార్ నెంబర్ వంటి వివరాలు ఎవరు అడిగినా ఇవ్వవద్దని చెప్పారు. ఇస్తే మీ ఖాతాలో ఉన్న డబ్బులను సైబర్ నేరగాళ్లు కొట్టెస్తారని చెప్పారు. ఒక వేళ మీ అకౌంట్ నుంచి నగదు బదలి అయిన వెంటనే 1930, లేదా 100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, 24 గంటల లోపు అయితే పోగొట్టుకున్న డబ్బులను వెనక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేశ్, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంజనగిరిలో జలసవ్వడి

- రిజర్వాయర్‌కు చేరిన 2 టీఎంసీలు
- నిలిచిన నీటి పంపింగ్
- 15,20 రోజుల్లో 2వ మోటర్ డ్రైరన్



డెలివరీ సిస్టర్న్ నుంచి ఎగిసి పడుతున్న నదీ జలాలు

కొల్లాపూర్, అక్టోబర్ 10 : పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో (నార్లాపూర్) అంజనగిరి మొదటి రిజర్వాయర్‌లోకి 2 టీఎంసీల నీరు చేరింది. దీంతో మంగళవారం ఉదయం 11గంటలకు పంప్‌హౌస్ నుంచి ఒక మోటరుతో నీటి తోడివేత ప్రక్రియను నిలిపివేశామని నీటిపారుదలశాఖ డీఈ లోకిలాల్ తెలిపారు. అయితే మరో 15,20 రోజుల్లోగా ప్రాజెక్టులో 2వ మోటర్‌ను ఆన్ చేసి డ్రైరన్ చేయుటకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే ఆ ప్రక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అంజనగిరి రిజర్వాయర్ మొత్తం 8.41 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రెండు నల్లమల కొండలను కలుపుతూ చుట్టూ 2,224 ఎకరాల విస్తీర్ణంలో 11.02కిలో మీటర్లు పొడవు,74 మీటర్ల ఎత్తుతో అంజనగిరి బండ్‌ను నిర్మించారు. దీంతో పచ్చని రెండు కొండల మధ్య రిజర్వాయర్ నీటితో తొణికిసలాడుతున్నది. శ్రీశైలం తిరుగు జలాలను అప్రోచ్ కెనాల్ నుంచి హెడ్‌రెగ్యులేటరీ ద్వారా సొరంగం మార్గంగుండా సర్జ్‌పూల్, అక్కడి నుంచి పంప్‌హౌస్‌కు చేరి అక్కడి నుంచి ప్రాజెక్టులోని ఒక మోటరుతో పైపుల నుంచి పైకి ఎగబాకుతూ డెలివరీ సిస్టర్న్ ద్వారా నదీ జలాలు అంజనగిరి రిజర్వాయర్ వైపు పరుగులు పెట్టింది. గత నెల 16న సీఎం కేసీఆర్ వెట్‌రన్‌ను ప్రారంభించిన విధితమే. గత నెల 27న రెండో సారి మోటరు ద్వారా నీటి తోడివేత ప్రక్రియ మొదలై ఈనెల 2వ మధ్యాహ్నం నిలిపివేయడంతో అంజనగిరి రిజర్వాయర్‌కు 1,6 టీఎంసీల నీరు చేరింది. మరో నాలుగు రోజుల విరామం అనంతరం ఈనెల 6వ తేదీ రాత్రి మోటరును ఆన్ చేయడంతో రెండు టీఎంసీల నీరు చేరడంతో నిండుకుండను తలపిస్తున్నది. అయితే దాన్ని అనుసరించే మరో పక్కన మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఎల్లూరు మొదటి రిజర్వాయర్‌లో కృష్ణానది జలాలతో జలదృశ్యాన్ని సాక్షాత్కరిస్తున్నాయి. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో దశల వారీగా మోటర్లను రన్ చేయుటకు నీటి పారుదలశాఖ అధికారులు శ్రమిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ అంజనగిరి రిజర్వాయర్ నీటితో కళకళలాడుతుండడం పర్యాటకుల మనుసును కట్టిపడేస్తున్నాయని చెప్పవచ్చు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహ్మదాబాద్, అక్టోబర్ 10 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం మేరకు మహ్మదాబాద్ గ్రామానికి చెందిన కోస్గి రాములు(38) వృత్తిరీత్యా తాపీ మేస్త్రీగా పని చేసేవాడు. రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చీ వేసిన భవనాల వద్ద గ్రామంలో కొంత మంది ఇనుప సీకులు తీసుకొని అమ్ముకుంటుడేవారు. ఈనెల 5వ తేదీన కోస్గి రాములు కూల్చీవేసిన గోడపై ఇనుప సీకులు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో బలమైన గాయాలయ్యాయి. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ దవాఖానకు తీసుకెళ్లగా అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నవోదయ 9, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి, అక్టోబర్ 10 : బిజినేపల్లి మండలం వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయం 2024–25 విద్యా సంవత్సరానికి గానూ 9వ తరగతి, 11వ తరగతి ప్ర వేశ పరీక్షలకు నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ విడుదల చేసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం 8వ తరగతి, 11వ తరగతి కోసం దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ఆధార్ కార్డు ఓటీపీ ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకొను విద్యార్థినీ, విద్యార్థులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నివాస ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. 9, 11తరగతులకు దరఖాస్తు చేసుకొనుటకు గాను 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2009 మే 1నుంచి 2011 జూలై 31మధ్య జన్మించిన వారై ఉండాలని, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1నుంచి 2009 జూలై 31 మధ్యలో జన్మించిన వారై ఉండాలని, దరఖాస్తుకు చివరి గడువు ఈనెల 31వరకు ఉంటుందని పేర్కొన్నారు. రాత పరీక్ష 10-02-2024న ఉంటుందని, దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవడానికి http://www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలన్నారు.